జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ **వార్త** తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ **వార్త** తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

ఆదివారం | 29-12-2024 | ఎడిటర్: చౌదరి ప్రమోద్ కుమార్ | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 204 పేజీలు: 4 వెల : రూ.7

# పకడ్బందీగా.. పరీక్షలు





- ఈనెల 30 నుంచి జనవరి 18 వరకు దేహదారుఢ్య పరీక్షలు
- సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఫిజికల్, ఎఫిషియన్సీ పరీక్షలు
- ధ్రువపత్రాలతో అభ్యర్థులు నిర్ణీత తేది, సమయానికి హాజరు కావాలి
- దళారులను నమ్మి మోసపోవద్దు
- ఎవరైనా డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయండి
- జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
- ఎచ్చెర్ల సాయుధ మైదానంలో జిల్లా పోలీసు అధికారులకు దిశానిర్దేశం

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 28 (వార్త):** పోలీసు కానిస్టేబుల్ నియామక ప్రక్రియలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి 18 వరకూ ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో దేహదారుఢ్య పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సాయుధ మైదానాన్ని శనివారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు. ప్రాథమిక రాత పరీక్షలో 7,390 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇందులో 1,175 మంది మహిళలు, 6,215 మంది పురుషులు ఉన్నారని చెప్పారు. ఫిజికల్ మెజర్‌మెంట్స్, ఎఫిషియన్సీ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అత్యాధు నిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఈ ఎంపికలు చేపడుతు న్నామన్నారు. వైద్య శిబిరాన్ని, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ ఎంపికలకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు కాల్ లెటర్‌లో సూచించిన విధంగా ఒరిజనల్ ధ్రువ పత్రాలతోపాటు ఒక సెట్ అటెస్టెడ్ జెరాక్స్ కాపీలు, ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణులైన కాఫీని తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దన్నారు. అభ్యర్థులను క్రమ పద్ధతిలో ఒక క్యూ లైన్లు లో మైదానంలోకి అనుమతించి వారి పట్ల మర్యాదగా, సహనంతో వ్యవహరించాలన్నారు. అభ్యర్థి ఒక్కరికి మాత్రమే మైదానంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత పొందిన ఫలితాల కాపీని తీసుకొనిరావాలని, సెల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవన్నారు. అభ్యర్థులు ఒకసారి గ్రౌండ్ లోనికి ప్రవేశించిన తరువాత అన్ని పరీక్షలు పూర్తి అయిన తరువాతే బయటికి అనుమతించబడుతుందన్నారు. దళారీలను నమ్మి మోసపోవద్దన్నారు. అట్టి వ్యక్తులు తారసపడతే 63099 90800, 63099 90911 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు అప్పారావు, మూర్తి, ప్రసాదరావు, శేషాద్రి, రాంబాబు, శివరామిరెడ్డి, ఏవో గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



# జోహార్.. జోగారావు

- అవయవదాతకు ఘన నివాళి
- మందసలో భారీ ర్యాలీ, మానవహారం

**మందస, డిసెంబరు 28(వార్త):** జోగారావు జీవించే ఉన్నాడు. అవయవదానంతో నలుగురు రూపంలో బతికే ఉన్నాడు. ప్రజల హృదయాల్లో చిరాయువుగా నిలిచిపోయాడు. మందస ప్రాంతంలో అవయవదానం చేసిన ఆదర్శమూర్తిగా నిలిచిపోయాడు. జోగారావు తల్లిదండ్రులు కొంకి మల్లేశ్వరరావు, సావిత్రి చూపిన దాతృత్వం ఎంతో మందికి ఆదర్శంగా మారింది. మందస పట్టణంలోని శ్రీశయనవీధికి చెందిన జూనియర్ లైన్‌మెన్ కొంకి జోగారావు ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. శ్రీకాకుళంలో చికిత్స పొందుతుండగా, బ్రెయిన్‌డెడ్ అయింది. దీంతో జోగారావు తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, సావిత్రి కుమారుడు అవయవాలను దానం చేశారు. దీంతో మందస ప్రజలు జోగారావుకు జేజేలు పలికారు. ఆ కుటుంబం చూపిన మానవత్వానికి మందస పట్టణంలో ప్రజలు శనివారం భారీ ర్యాలీ, బస్టాండ్లో మానవహారం నిర్వహించారు. శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అమరహే జోగారావు, జోహార్ జోగారావు అంటూ నినాదాలు చేసి కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. రాజకీయాలు, కులాలకు, మతాలకు అతీతంగా అందరూ కలిసి, కార్యక్రమంలో పాల్గొన్నారు.





# నేడు కోటి దీపోత్సవం

**శ్రీకాకుళం, డిసెంబర్ 28(వార్త):** అష్టలక్ష్మి పుష్పయాగ సహిత కోటి దీపోత్సవం ఆదివారం ఏడురోడ్ల కూడలిలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ మైదానంలో నిర్వహించనున్నట్టు విజయదుర్గా అమ్మవారు ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, విజయ గణపతి ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ పెంట శ్రీధర్ శర్మలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్సవాలకు భారతీ తీర్థ సన్మాన గ్రహీత, రెండు తెలుగు రాష్ట్రాలకు శృంగేరీ మఠం, శంకర తత్వప్రసార అభియాన్, శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్య భక్త సమాజ వ్యవస్థాపకులు, తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మతో ఆదివారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ప్రవచనామృతం ఉంటుందన్నారు. ఈ ప్రాంగణంలో అష్టలక్ష్ములు ప్రతిష్ట, మహా లింగాల ఏర్పాటు ఉంటుందన్నారు. 86 బాక్సులలో 350 లింగాలు ఏర్పాటు చేసి ఒక్కో ప్రమిదలో 366 ఒత్తులను ఉంచి కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దీపోత్సవంలో పాల్గొనాలనుకునే భక్తులు 9440546872, 9155555599 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ ఉత్సవంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్, ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి తో పాటు అధికారులు పాల్గొంటారని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గురుమూర్తి కుటుంబానికి శివాజీ పరామర్శ



**వజ్రపుకొత్తూరు, డిసెంబర్ 28(వార్త):** వజ్రపుకొత్తూరు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బుల్లోజి శశిభూషణ్‌రావు తండ్రి గురుమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆయనను శనివారం మాజీ మంత్రి శివాజీ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, పలాస నియోజకవర్గ సీనియర్ నాయకులు వజ్జ బాబూరావు, మల్ల శ్రీనివాసరావు, కణితి సురేష్, లైశెట్టి భీమారావు తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు సబ్సిడీపై వేట పరికరాలు

**-మత్స్య శాఖ అధికారి ధర్మరాజు పాత్రో**

**వజ్రపుకొత్తూరు, డిసెంబర్ 28(వార్త):** మత్స్యకారులకు సబ్సిడీపై వేట పరికరాలు మంజూరు చేస్తామని పలాస మత్స్య శాఖ అధికారి ధర్మరాజు పాత్రో తెలిపారు. శనివారం ఆయన మంచినీళ్లపేటలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాలపై మత్స్యకారులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ఫైబర్ బోట్లు, తెప్పలు వలలు, ఇంజన్లు, ఐస్ బాక్సులు, లైఫ్ జాకెట్స్, లైఫ్ బాయ్ జీపీఎస్, ఇతర పరికరాలు సబ్సిడీపై మంజూరు చేస్తామన్నారు. మత్స్యకార మహిళలకు 60 శాతం, పురుషులకు 40 శాతం సబ్సిడీ వర్తింపజేస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన మత్స్యకారులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దేవునల్తాడ, కొత్తపేట కంబాలరాయుడుపేట, హుకుంపేట, నువ్వలరేవు, చిన్నకొత్తూరు,గునుపల్లి, డోకులపాడు మత్స్యకార గ్రామాల్లో ఈ పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అయితే 75% సబ్సిడీపై మంజూరు చేస్తే పథకాలన్నీ వినియోగించుకుంటామని మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మాధవరావు అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై పాత్రో స్పందిస్తూ ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ కొండ నాగరాజు, మత్స్యకారుల నాయకులు సోడిపిల్లి దీనరావు, కొమర గోపాల్, బుంగ వాసు, కావళ్ల ధర్మ, మత్స్య శాఖ వీఎఫ్ఏ జ్యోత్స్న, సాగర్‌మిత్ర శివాజీ, కిరణ్‌బాబు, సంధ్య, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్సీ పరామర్శ



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 28(వార్త):** ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబీకులను ఎమ్మెల్సీ నర్తు రామారావు పరామర్శించారు. దుర్గ గురుస్వామి ఇంటికివెళ్లి ఆ కుటుంబాన్ని ఓదార్చారు. తెలుగుదేశం నాయకులు ఎస్ఎన్ పండా భార్య మనోరమ పండా అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, పిలక దేవరాజ్, కౌన్సిలర్ బచ్చు జగన్, పట్టణ అధ్యక్షుడు ప్రకాష్ పట్నాయక్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## మందస సర్వేయర్‌కు మాతృ వియోగం



బొడ్డపాటి సీతమ్మ(ఫైల్ )

**మందస, డిసెంబర్ 28(వార్త):** మందస సర్వేయర్ బొడ్డపాటి బాబూరావుకు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి సీతమ్మ(92) శనివారం విశాఖలో మరణించారు. సీతమ్మ మృతదేహాన్ని మందసకు తీసుకువచ్చి, కుటుంబసభ్యులు,బంధువుల అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు జరిపారు. సీతమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బాబూరావును పలువురు పరామర్శించి, సంతాపం తెలిపారు.

# ఎస్ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్స్ ఆవిష్కరణ



**మందస, డిసెంబర్28(వార్త):** యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించబడిన ఎస్ఎస్‌సీ-2025 మోడల్ టెస్ట్ పేపర్లను హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గవర ఉమారాజు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మాట్లాడుతూ 15ఏళ్లుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించబడిన మోడల్ పేపర్లను ముద్రిస్తున్నామన్నారు. వీటి నుంచి ఏటా పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో 80 శాతానికి పైగా ప్రశ్నలు వస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించేందుకు ఈ పేపర్లు విద్యార్థులకు ఉపయోగపడుతున్నాయన్నారు.యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది మారిన సిలబస్ ఆధారంగా రూపొందించబడిన పుస్తకాలను ఎక్కువ మంది విద్యార్థులతో చదివించి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జనవరి 5,6,7,8 తేదీల్లో కాకినాడలో జరుగుతున్న యూటీఎఫ్ రాష్ట్ర స్వర్ణోత్సవ మహాసభలకు మండలం నుంచి ఎక్కువ మంది ఉపాధ్యాయులు హాజరవ్వాలని కోరారు. కార్యక్రమంలో మందస మండల యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు జన్ని సోమేశ్వరరావు, కళాశాల ఇన్‌చార్జి ఎం.చక్రధరరావు, జి.రమణబాబు, జి.తేజేశ్వరరావు, కె.శేషగిరిరావు, పి.లోకనాథం, ఎస్.రేణుక, కె.అరుణకుమారి, పి.జగన్మోహన్‌రావు, డి.కృష్ణారావు, సంతోష్ కుమార్ పండా, ఎస్.స్వప్న, బి.తిరుపతిరావు, కె.మంజుల, బి.తులసి, ఎన్.ఈశ్వరి, ఇందుమతి పాత్రో తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల పెంపు పాపం జగన్‌దే



**రాజాం, డిసెంబర్ 28(వార్త):** విద్యుత్ చార్జీల పెంపు పాపం మాజీ ముఖ్యమంత్రి జగన్‌దే అని తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గురవాన నారాయణరావు అన్నారు. శనివారం ఆయన రాజాంలో మీడియాతో మాట్లాడారు. కమీషన్ల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్‌మీటర్లు లాంటి విద్యుత్ పరికరాలను అధిక రేట్లకు కొనుగోలు చేయడంతో వేల కోట్ల భారం ప్రజలపై పడుతోందన్నారు. ఇందుకు జగనే కారణమై, ఆయనే ధర్నాలు చేయడం ప్రజలను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. మిగులు విద్యుత్‌తో పాలన ప్రారంభించిన జగన్.. 5 ఏళ్లలో 10సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్లు భారం మోపి, వారి నడ్డి విరిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గేదెల బాలమురళి, ఒళ్లూరు గణేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# సిక్కోలుకు మందస డ్వాక్రా ఉత్పత్తులు



**- వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు**

**మందస, డిసెంబర్ 28(వార్త):** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వారు శ్రీకాకుళంలో జనవరి 3నుంచి నిర్వహించే డ్వాక్రాబజారులో చిన్నబరంపురం మహిళల కొయ్యబొమ్మల ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందసలో తయారయ్యే స్వీట్స్, స్నాక్స్, కోవాను కూడా పంపిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి నుంచి వెళ్లే డ్వాక్రా మహిళలకు ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ డ్వాక్రాబజార్‌ను మహిళలందరూ సద్వినియోగపరుచుకోవాలని ఆయన సూచించారు.

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు




**వంగర, డిసెంబర్ 28(వార్త):** భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని టీడీపీ సీనియర్ నేత, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవరావునాయుడు అన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతుల భూ సమస్యల్లో జరిగిన తప్పొప్పులను సరి చేయడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని తమ భూములను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.ధర్మరాజు, టీడీపీ నాయకులు ఎం.గణపతి, గ్రామ రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు తూర్పు కాపుల ఆత్మీయ కలయిక




**శ్రీకాకుళం, డిసెంబర్ 28(వార్త):** శ్రీకాకుళం జిల్లాలో అత్యధిక శాతం జనాభా కలిగిన తూర్పు కాపు సామాజికవర్గ ఆత్మీయ కలయిక సదస్సు ఈ నెల 29న ఎచ్చెర్ల కేశవరెడ్డి స్కూల్ వద్ద జరగనుంది. తూర్పుకాపుల ఐక్యత నుచాటిచెప్పే ఈ సదస్సుకు ఉత్తరాంధ్ర జిల్లాల నుండి పెద్ద ఎత్తున తూర్పు కాపు సామాజికవర్గ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇప్పటికే ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయని నిర్వాహక కమిటీ ప్రతినిధులు డోల జగన్ మోహన్, సురంగి మోహనరావు శాసపు జోగినాయుడు, లంక గాంధీ. ఇజ్జాడ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తూర్పుకాపు సామాజికవర్గానికి చెందిన వారంతా తరలి రావాలని వారు కోరారు. తూర్పు కాపుల ఐక్యత చాటి చెబుదామని వారు పిలుపునిచ్చారు.

# ఎస్సీల గణనపై ఇంటింటి సర్వే జరపాలి

**-రాష్ట్ర దళిత నేతల డిమాండ్**

**వంగర, డిసెంబర్ 28(వార్త):** ఎస్సీ గణనకు ఇంటింటి సర్వే చేపట్టాలని రాష్ట్ర దళిత నేతలు డిమాండ్ చేశారు. శనివారం వారు వంగరలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన తెలిపారు. రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి (ఎస్ఎన్‌పీఎస్) మజ్జిగ గణపతి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ/వార్డ్ సచివాలయాల్లో ప్రదర్శించిన ఎస్సీ కులగణన ఆడిట్‌లో జరిగిన తప్పులను సవరించాలని కోరారు. లేకుంటే మాలలు తీవ్ర అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.గణపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సచివాలయానికి కెళ్లినా కులం పేరు తప్పుగా, నివసించిన వారి పేర్లు లేకపోవడం, ఇంటి పేర్లు తప్పులు దొర్లడం వంటివి స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఈ విషయమై తక్షణమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో దళిత నాయకులు చిత్తిరి గంగులు, రాంబాబు, సింహాచలం, సిర్లి రాజు, యజ్జల సింహాచలం, రామారావు, డి.రాంబాబు, సుధీర్, చంటి, పండు, టి.సింహాచలం, చిన్న, ఉదయ్‌రామ్, ఫకీర్, యజ్జల రాము, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కి నివాళులు

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 28(వార్త):** ఇచ్ఛాపురంలోని శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్కూల్ చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు మౌనం పాటించారు. ఈసందర్భంగా కృష్ణమూర్తిరెడ్డి మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ఆర్థికవేత్తగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎన్నో సేవలందించారన్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసీ పూరి, ఉపాధ్యాయులు పద్మజ, సునీత, యశోద, రవి ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ తేజస్, సెక్రటరీ మోహన్‌ప్రియ, జాయింట్ సెక్రటరీ డి.హర్షవర్ధన్ రెడ్డి, ఎస్‌పీఎల్ జ్యోత్స్న పాల్గొన్నారు.



# జనవరి 3న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 28(వార్త):** జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు జనవరి 3న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజా తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థాయీ సంఘాల సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 10.30 గం.లకు 6వ స్థాయి, 11.30 గం.లకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12.30 గం.లకు 5వ స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం 2.30 గం.ల నుండి 2,4 ,1, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జరగనున్నట్లు ఆ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. సభ్యులు సమావేశానికి తప్పనిసరిగా హాజరవ్వాలని ఆయన కోరారు.

## ఆపదలో 1098, 139కు ఫోన్ చేయండి




**పలాస, డిసెంబర్ 28(వార్త):** ఆపదలో ఉన్నప్పుడు సహాయం కోసం 1098, 139 నంబర్లకు ఫోన్ చేయాలని రైల్వే ప్రయాణికులకు జీఆర్‌పీఎఫ్, చైల్డ్ హెల్ప్‌లైన్ డెస్క్ వారు సూచించారు. పలాస రైల్వేస్టేషన్లో శనివారం వారు రైల్వే ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బాలల సహాయార్థం 1098 సేవలు అందుతాయన్నారు. పిల్లల అక్రమ రవాణా, భిక్షాటన, తప్పిపోయిన పిల్లలు, తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ డెస్క్ సూపర్‌వైజర్ బాల సరస్వతి, ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



**పలాస, డిసెంబర్ 28(వార్త):** మొగిలిపాడు జాతీయ రహదారి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం సుర్లా ప్రాంతానికి చెందిన కృష్ణారావు పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తూ.. మొగిలిపాడు జాతీయ రహదారి వద్ద ఆగి ఉన్న లారీని వెనుకనుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే 108 సిబ్బంది సత్యం, శ్రీనివాసరావు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అందించి, పలాస ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం



**పలాస, డిసెంబర్ 28(వార్త):** విద్యార్థులంతా ఏకాగ్రతతోనే విద్యపై దృష్టి పెట్టాలని కిడ్నీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు కూన మోహనరావు అన్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ డాక్టర్ కణితీస్ ఐటీఐ ప్రాంగణంలో శనివారం పవన్ పుత్ర బ్లడ్‌బ్యాంక్ సౌజన్యంతో నవతరం సేవా సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానం అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా, మంచి మార్గాన్ని ఎంచుకోవాలని కోరారు. చదువుకుంటే ఉన్నత స్థానం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ పైల జవహర్, ఉపాధ్యాయులు రవి, నందిని, రమణయ్య, ధర్మారావు, మూర్తి, పవన్ పుత్ర బ్లడ్ బ్యాంక్ మేనేజర్ సాయి, నవతరం సేవా సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన

**పలాస, డిసెంబర్ 28(వార్త):** సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన అవసరమని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన పలాసలోని శ్రీవిద్యా వాహిని కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ జోలికి పోవద్దని హితవు పలికారు. ఆన్‌లైన్ మోసాలు, మొబైల్ గేమింగ్ యాప్స్, మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పీఎం సూర్యఘర్ వినియోగించుకోండి

**-కరెంటు బిల్లులను ఆదా చేసుకోండి**
**-శాసనసభ్యుడు గొండు శంకర్**
**-ఎమ్మెల్యే ఇంటికి 3కేవీ కెపాసిటీతో రెండు సోలార్ యూనిట్లు ఏర్పాటు**

**శ్రీకాకుళం, డిసెంబర్28(వార్త):** పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. ఈ పథకంలో భాగంగా 3 కేవీ కెపాసిటీతో, రెండు యూనిట్లను ఆయన స్వగృహానికి శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ పవర్‌ను ప్రతి ఒక్కరూ గృహాలకు వినియోగించుకుంటే కరెంట్ బిల్లులు చాలా వరకు తగ్గుతాయన్నారు. ప్రభుత్వ సబ్సిడీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటే మిగులు విద్యుత్‌ను గ్రిడ్, ఇతర అవసరాలకు అమ్ముకోవచ్చని తెలిపారు. ఈ సోలార్ పవర్ పథకానికి దరఖాస్తు చేసిన 15 రోజుల్లో విద్యుత్ శాఖ వారు సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయడంతో..ఎలక్ట్రికల్ ఎస్ఈ, ఈఈ, ఇతర సిబ్బందిని అభినందించారు.

కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఎస్ఈ ఎన్ కృష్ణమూర్తి, ఈఈ, ఏడీఈ, నియోజ క వర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీశంకర్, కుటుంబసభ్యులు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.



# తుగ్లక్ డ్రామాలు వద్దు జగన్

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**పోలాకి, డిసెంబర్ 28(వార్త):** జగన్ తుగ్లక్ పాలనతో రాష్ట్రం అస్తవ్యస్తమైందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం ఆయన నరసన్నపేటలోని తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. జగన్ అసమర్థత, అవినీతితోనే విద్యుత్ చార్జీలు పెరిగాయని, ఆయన తుగ్లక్ డ్రామాలు ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. విద్యుత్ చార్జీల పెంపు భారం పాపం ఎవరిదో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలోని ఒప్పందాలను రద్దు చేసి కమీషన్ల కక్కుర్తి కోసం జగన్ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరిట విద్యుత్ రంగాన్ని కుప్పకూల్చిందని ఆరోపించారు.రూ.17 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం పెంచింది జగనేనని మండిపడ్డారు. ఆనాడు జగన్ చేసిన ఒప్పందం ఫలితమే నేడు కరెంటు చార్జీల పెంపు అన్నారు. కళ్లు మూసి పిల్లి పాలు తాగినట్లు.. ఇప్పుడు కరెంట్ చార్జీలు పెంచారంటూ వైసీపీ ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. జగన్ అవినీతి, అసమర్థతతో రాష్ట్ర ప్రజలపై, డిస్కమ్‌లపై రూ.1,29,503 కోట్లు భారం పడిందన్నారు. జగన్ 5 ఏళ్ల దరిద్రపు పాలనలో 9 పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ఆరుగాలం శ్రమించే రైతుల నుంచి విద్యుత్ బిల్లుల పేరుతో జగన్ దోపిడీకి సిద్ధమయ్యారని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించారని, దీనిపై అప్పట్లో తాము ఉద్యమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే కార్యక్రమానికి అడ్డుకట్ట వేశారన్నారు. జగన్ చేసిన పాపాలు శాపాలై రాష్ట్ర ప్రజలను వెంటాడుతున్నాయన్నారు. తప్పులన్నీ చేసేసి ఏమీ ఎరుగనట్లు ధర్నాకు దిగుతున్నాడని మండిపడ్డారు. ఇటీవల రైతుల పేరుతో నిరసన తెలిపాడని, ఇపుడు విద్యుత్ ఛార్జీల పేరుతో మరో జగన్నాటకానికి తెరతీశాడని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ఇంకెన్ని డ్రామాలు ఆడతాడో చూడాలన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా.... ప్రజలను ఆయన్ని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఆరు నెలల కాలంలో తమది మంచి ప్రభుత్వమని నిరూపితమైందన్నారు.

## దళారులను నమ్మొద్దు



**టెక్కలి,డిసెంబర్ 28(వార్త):** ఎచ్చెర్ల పోలీస్ గ్రౌండ్‌లో కానిస్టేబుల్ అభ్యర్థులకు జరగనున్న దేహధారుడ్య పరీక్షల్లో దళారులను నమ్మొద్దని టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. శనివారం ఆయన టెక్కలి పోలీస్‌స్టేషన్‌లో విలేఖరులతో మాట్లాడారు. ఫిజికల్ పరీక్షల్లో ఉత్తీర్ణత చేయిస్తామని ఎవరైనా నమ్మిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఈ విషయంలో నిరుద్యోగ అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. న్యూ ఇయర్ వేడుకల్లో యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హితవు పలికారు. ఈనెల 31న రాత్రి 12:30 గంటల తర్వాత ఎవరు గుమిగూడి తిరగరాదని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లు పైన బాణసంచా కాల్చరాదని, కేకలు వేయడం గాని చేయరాదన్నారు. మద్యం తాగి రోడ్లపై వాహనాలు నడిపితే తనిఖీలు చేపట్టి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పైన డీజే పెట్టడం, డ్యాన్సులు వేయడం చేయరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకోవాలని సూచించారు. ఆయన వెంట టెక్కలి అర్బన్ సీఐ అంబటి విజయ కుమార్ ఉన్నారు.

# పరీక్షా పే చర్చకు సన్నద్ధం కండి



**వంగర, డిసెంబర్ 28(వార్త):** విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని పోగొట్టాలనే ధ్యేయంతో ప్రధాని మోదీ తలపెట్టిన పరీక్ష పే చర్చకు వారిని సన్నద్ధం చేయాలని మండల విద్యాశాఖ అధికారి-1 పి.ప్రవీణ్‌కుమార్ హెచ్ఎంలకు ఆదేశించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తి గల తల్లిదండ్రుల వివరాలను జనవరి 14లోగా నమోదు చేయాలన్నారు. వీరు ప్రధాని మోదీతో పరీక్ష పే చర్చా కార్యక్రమంలో మాట్లాడవచ్చని స్పష్టం చేశారు. మండల సైన్స్ ఫేర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపిస్తామన్నారు. త్వరలోనే నిర్వహించనున్న ఎస్ఎంసీ సభ్యుల శిక్షణకు సభ్యులంతా హాజరయ్యేలా చూడాలని తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచడానికి విద్యార్థులకు యాక్షన్ ప్లాన్ ఇచ్చామని, వంగర మండలాన్ని పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోనే ప్రథమస్థాయిలో ఉంచడానికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన విద్యా కార్యక్రమాలను పూర్తి చేసి మండలాన్ని జిల్లాలోని మొదటి వరుసలో ఉంచడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలని కోరారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 28(వార్త):** మొక్కలు పెంచడం సామాజిక బాధ్యత అని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏవో రజనీకుమారి, సుధాకర్, యుగంధర్, బాపూజీ, ప్రసాద్, జగదీష్, కరుణాకర్, సునీత తదితరులు పాల్గొన్నారు.



# నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్లతో నిఘా

**-చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తున్న జిల్లా పోలీసులు**
**-శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో అమలు**



**శ్రీకాకుళం, డిసెంబర్ 28(వార్త):** నిర్మానుష్య ప్రదేశాల్లో డ్రోన్ నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగర పరిధిలోని పీఎన్ కాలనీ, భైరివానిపేట, కిమ్స్ హాస్పిటల్, శాంతినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బహిరంగ మద్యపాన సేవనం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్‌పై డ్రోన్ కెమెరాలతో పోలీసులు నిఘా పెట్టారు. పాడుపడిపోయిన బంగ్లాలు, నివాస గృహాలను డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు.

బహిరంగంగా మద్యం, గంజాయి సేవిస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## గంజాయి బ్యాచ్ దాడి..ఒకరికి గాయాలు



**రాజాం, డిసెంబర్ 28(వార్త):** రాజాంలో గంజాయి బ్యాచ్ మళ్లీ హల్‌చల్ చేశారు. రాజాం నుంచి సారథి గ్రామానికి వెళ్తున్న అడపా శ్యామ్ అనే యువకుడిపై వారు దాడి చేసి, విచక్షణారహితంగా కొట్టారు. గంజాయి మత్తులో దుండగులు రాళ్లతో దాడి చేశారు. క్షతగాత్రుడిని స్థానికులు రాజాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి స్థానిక వైఎస్ఆర్ పార్క్ వద్ద రెండు గ్రూపులు గొడవపడుతుండగా, తాను సర్దిచెప్పగా దాడి చేశారని, వారు గంజాయి మత్తులో ఉన్నారని బాధితుడు పోలీసులకు తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రాజాంలో గంజాయి బ్యాచ్‌ని అరికట్టాలని స్థానికులు పోలీసులను కోరారు.

# పనులు..ఇంకెన్నాళ్లు?

- పలాస కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- ప్రాధాన్యత పరంగా చేపడుతున్నాం
- మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు




మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు, హాజరైన సభ్యులు, అధికారులు

**పలాస, డిసెంబర్ 28(వార్త):** పలాస మున్సిపాలిటీలో అభివృద్ధిపై స్పష్టత లేదని, మూడు మాసాలుగా సమావేశాలు నిర్వహించి సాధించింది ఏమీ లేదని, కౌన్సిల్ బాడీ మెదటి సమావేశాల్లో తీర్మానించిన అభివృద్ధి పనులే నేటికీ పూర్తి కాని పరిస్థితి ఉంటే, కొత్త పనులు అజెండాలో పెట్టి ఆమోదించినా ఎప్పటికి పూర్తవుతాయోనని మున్సిపల్ కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్, జోగ త్రివేణి, తంగుడు ఆశాలత, బెల్లాల శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో నిధులు విడుదల చేస్తామన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. తొలుత ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశం ప్రారంభమైంది. వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను కౌన్సిలర్లకు అందజేశారు. వీటిపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డుల్లో 2021లో ఆమోదించిన పనులే నేటికి ప్రారంభం కాలేదని, కొన్నింటికి ఇప్పటికీ అంచనాలు కూడా వేయలేదని, కొన్ని వార్డుల్లో ఒకటి, రెండు పనులు నామమాత్రంగా చేపట్టారని, తాము ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. తాము కౌన్సిలర్లుగా ఉండి వార్డుకు, ఏమి ఉపయోగమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చైర్మన్ బల్ల గిరిబాబు స్పందించారు. అభివృద్ధి పనులు నత్తనడకన జరగడం, కొన్ని వార్డుల్లో ఒక్క పని కూడా జరగకపోవడం వాస్తవమే అన్నారు. ప్రాధాన్యత గల కొన్ని అభివృద్ధి పనులు చేపట్టామని, అధికారుల మార్పు, బిల్లులు సక్రమంగా విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా ముందుకు రాని పరిస్థితి ఉందన్నారు. రానున్న కాలంలో అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేసుకొని మున్సిపాలిటీకి మంచిపేరు వచ్చేలా సమష్టిగా కృషి చేద్దామని కోరారు. కమిషనర్ ఎన్.రామారావు మాట్లాడుతూ కౌన్సిలర్లు జోగ త్రివేణి, తంగుడు ఆశాలత లేవనెత్తిన పనులకు వచ్చే సమావేశం నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేసుకొని ఇప్పటివరకు వార్డులకు కేటాయించిన పనుల్లో 50 శాతమైనా పూర్తి చేయాలన్నారు. కౌన్సిలర్ బెల్లాల శ్రీను మాట్లాడుతూ ఇంత వరకు ఒక్క పని కూడా కాని వార్డులకు మెదటిగా ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కౌన్సిలర్ గుజ్జు జోగారావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు కుటుంబాలకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ రామారావు మాట్లాడుతూ కార్మికులు వేతనాలు తప్పక చెల్లిస్తామన్నారు. కౌన్సిలర్ దుర్గా శంకర్‌పండా మాట్లాడుతూ వార్డుల వారీగా పనుల జాబితా వివరాలు అందించాలని కోరారు. కౌన్సిలర్ బోర చంద్రకళ టిడ్కో ఇళ్ల పరిస్థితిపై అధికారులను నిలదీశారు. వారంలో విధి, విధానాలు వస్తాయని అప్పుడు పూర్తి సమాచారం అందిస్తామన్నారు. కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో విద్యుత్ పోల్స్ సమస్య ఉందన్నారు. ఎమ్మెల్యే చొరవతో పోల్స్ వచ్చాయన్నారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ పేదలను ఇబ్బంది పెట్టవద్దని, కొద్దిపాటి మొత్తం వసూలు చేయాలన్నారు. కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ బయోటాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, నిరుద్యోగులు కోసం గ్రంథాలయాల్లో అన్ని పత్రికలు, పుస్తకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మున్సిపల్ డీఈ కనకరాజు, ఏఈలు, టీపీవో, కౌన్సిలర్లు సవర సోమేశ్వరరావు, డిక్కల ఆనందరావు, సనపల సింహాచలం, బళ్ల రేవతి, పోతనపల్లి ఉమ తదితరులు పాల్గొన్నారు.

## బాగింపేట బీటీ రోడ్డుకు రూ.1.95 కోట్లతో ప్రతిపాదన



**వంగర, డిసెంబర్ 28(వార్త):** గోతులమయమైన అరసాడ నుంచి బాగింపేట రోడ్డు నిర్మాణానికి రూ.1.95 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఎంపీపీ సురేష్‌ముఖర్జీ తెలిపారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ఆమోదించి ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. మండల పరిషత్ తీర్మానం ఆమోదించి సంబంధిత ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపించినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ నిధులతో అరసాడ నుంచి నీలయ్యవలస, బాగింపేట వరకూ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఇక్కడి వాసులకు గ్రహణం తొలగినట్లే. ఈ రోడ్డు పూర్తిగా గోతులు మయమవ్వడంతో రెండేళ్లుగా రాజాం నుంచి బస్సును నిలిపివేసిన విషయం విదితమే. ప్రస్తుతం బస్సు తిరగకపోవడంతో 10 గ్రామాల ప్రజలు నరకాన్ని చూస్తున్నారన్నారు. ప్రస్తుతం ఈ నిధులు మంజూరుతో బీటీ రోడ్డు పూర్త యితే ఆ 10 గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం కలిగి ఇబ్బందులు తొలగనున్నాయి.

## పారామిలిటరీ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయించండి



**పలాస, డిసెంబర్ 28(వార్త):** జిల్లాలో పారా మిలిటరీ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేయాలని మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును జిల్లాలోని సైనికులు కోరారు. బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఏఆర్ జిల్లా సైనిక సోదరులందరూ శనివారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని కలిశారు. జిల్లాలో పారా మిలిటరీ బలగాల ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు అయ్యేందుకు కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. చాపర గ్రామ వాసి జిల్లా పారామిలిటరీ కుటుంబసభ్యురాలైన పెద్దింటి నీలావతి, ఎస్ఎస్‌బీ సైనికులు పారామిలిటరీ కుటుంబాల సమస్యలు తెలిపారు. జిల్లాలో పారామిలిటరీ కార్యాలయం స్థాపిస్తే స్థానికంగా ఉన్న వేల పారా మిలిటరీ కుటుంబాలు నివాసం ఉండవచ్చున్నారు. రాష్ట్ర యువతకు పారా మిలిటరీ విభాగాల్లో ఎంపికలు నిర్వహించవచ్చున్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. స్థానికంగా పారామిలిటరీ విభాగాల శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తానని సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం పారామిలిటరీ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘ అధ్యక్షుడు కె.రామారావు, పారామిలిటరీ సైనికులు పాల్గొన్నారు.

## అటవీ హక్కుల చట్టంపై గిరిజనులకు అవగాహన



**మెళియాపుట్టి, డిసెంబర్ 28(వార్త):** అడవులు దేశ ప్రయోజనాలకు ప్రధానమని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యుడు జగన్ తెలిపారు. గొట్టిపల్లి పంచాయతీ పరిధిలోని మూలనేలబొంతు, జన్నిపేట, నేలబొంతు తదితర గ్రామాల్లో కొత్తూరు వెలుగు అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అటవీ హక్కుల చట్టంపై గిరిజనులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ అటవీ చట్టం 1927లో రూపొందించారని తెలిపారు. ఈ చట్టం కేంద్ర చట్టంలో ముఖ్య భూమిక పోషిస్తూనే వివిధ రాష్ట్ర చట్టాలలో వారి స్థానిక అవసరాలకు అనుగుణంగా సవరణలు చేశాయన్నారు. కొన్ని రాష్ట్రాలు తమ సొంత అటవీ చట్టాలను రూపొందించాయన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ఎ.చిరంజీవిరావు, ఏరియా కోర్డినేటర్ నాగరాజు, సమన్వయకర్త జి.జగన్నాథం, సర్పంచ్ ప్రతినిధి జనార్దనరావు, మొబలైజర్లు పి.కళ్యాణి, పి.హరిచంద్రరావు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

## కోరం లేకుండానే మండల సమావేశమా..?

-సంతబొమ్మాళి అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
-బడ్జెట్‌ను ఆమోదించిన సభ్యులు
-వేతనాల బకాయిల కోసం నిలదీసిన ఎంపీటీసీ సభ్యులు




**సంతబొమ్మాళి, డిసెంబర్ 28(వార్త):** కోరం లేకుండా సంతబొమ్మాళి బడ్జెట్ సమావేశం నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల సర్వసభ్య సమావేశానికి సభ్యుల్లో మూడో వంతు హాజంవ్వాలి. ఒకవేళ లేకుంటే వేరే రోజుకు సమావేశం వాయిదా వేయాలని నిబంధనలు చెబుతున్నాయి. అయితే వీటిని సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయ అధికారుల నిబంధనలు తుంగలో తొక్కారు. మండల పరిషత్ 2024-25 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, 2025-28 సంవత్సరపు బడ్జెట్ ఆమోదం కోసం బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, నౌపడ ఎంపీటీసీ సుధాకర్, లక్కివలస ఎంపీటీసీ చింతల రాజులు, చినతుంగాం ఎంపీటీసీ వాదరేవు జగన్ మాత్రమే హాజరయ్యారు.

కేవలం నలుగురు సభ్యులు మాత్రమే హాజరు కాగా ఎంపీడీవో జయంత్ ప్రసాద్ సభలో తొలి పలుకు పలికి ప్రారంభించారు. ఏవో కుమార్ బడ్జెట్ చదువుతుండగా మధ్యలో ఆర్‌హెచ్‌ఎపురం ఎంపీటీసీ సభ్యుడు సవర రాజు వచ్చారు. సభ పూర్తవుతుందన్న సమయంలో మేఘవరం ఎంపీటీసీ సభ్యుడు సూరాడ రాజారావు వచ్చారు. కోరం లేకపోయినా ఏకంగా 2024-25 ఆర్థిక సంవత్సరంగాను 51కోట్ల 78 లక్షల 2 వేల 945 రూపాయలతో సవరణ బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు.

## రహదారులకు మోక్షమెన్నడు?



**ఎల్ఎన్ పేట (వార్త) :** జాడుపేట, మోదుగవలస జంక్షన్ నుంచి కొమ్ముvalasa, గొట్టిపల్లికి వెళ్లే రహదారి, చొర్లంగి పాఠశాలకు వెళ్లే రహదారి చాలా అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా రాకపోకలకు విద్యార్థులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుందంటున్నారు. చిన్నపాటి వాన కురిస్తే ఈ రహదారి మీదుగా నడవలేని పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. గత ప్రభుత్వం హయాంలో కూడా ఎన్నో పర్యాయాలు రహదారి కోసం విన్నవించుకున్నప్పటికీ పరిష్కారం లేకపోయిందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు కలుగజేసుకొని వాహనాల రాకపోకలు సాగించే రహదారికి మరమ్మతులు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546